TGTEL/25/A0880

# నమస్తే భారత్

తెలుగు దినపత్రిక

NAMASTHE BHARAT TELUGU DAILY

న్యాయమిత్ర న్యూస్ దినపత్రిక
నమస్తే భారత్ తెలుగు దినపత్రిక
NAMASTHE BHARAT TELUGU DAILY

మన సమాజంలో జరుగుతున్న న్యాయపరమైన, చట్టపరమైన మరియు సామాజిక సమస్యలపై సందేహాలు మరియు పరిష్కారం కొరకు ఒక నిబద్ధతతో కూడిన సంబంధిత సమస్యలకు అనుభవజ్ఞులైన న్యాయనిపుణుల సహకారంతో పరిష్కార వేదికగా నమస్తే భారత్ మరియు న్యాయమిత్ర వేదికగా నిలుస్తుంది.. అలాగే ప్రభుత్వ విభాగంలో నేలకొనియున్న అన్ని సమస్యలకు పరిష్కార మార్గం చూపుతుంది. మీకు మరియు మీ చుట్టు పక్కల వారి హక్కుల ఉల్లంఘనను, మీకు జరిగిన అన్యాయం గురించి ఫిర్యాదులను మరియు వాటికీ సంబంధిచిన సమాచారని, సాక్షాలతో మాకు తెలియపరచగలరు.. ..ఎడిటర్ డెస్క్ 94916 23567

మల్కాజిగిరి | సంపుటి : 01 | సంచిక : 14 | ఎడిటర్ : కందాడి మహేందర్ రెడ్డి | సోమవారం, జూన్,15, 2026 | పేజీలు : 8 | వెల : రూ.4/-

## వర్షాకాలం నేపథ్యంలో
# అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

- ప్రాజెక్ట్‌ల వద్ద పటిష్ట చర్యలు తీసుకోవాలి
- అనుమతి లేకుండా ఇంజనీర్లు ప్రాజెక్ట్‌లు వదిలి వస్తే కఠిన చర్యలు
- జూన్ 9న వర్షం సమయంలో అధికారులు సరిగా పని చేయలేదు
- అవసరమైతే నేను కూడా రోడ్డుపైకి వస్తా
- సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, జూన్ 14**

వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశంచేశారు. ప్రకృతి విపత్తులపై సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. వర్షాలు, ప్రకృతి విపత్తులపై ఆదివారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధీ పెవిలియన్‌లో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై అధి కారులకు దిశానిర్దేశంచేశారు. వర్షాల నేపథ్యం లో ప్రాజెక్ట్‌ల వద్ద పటిష్ట చర్యలు తీసుకోవాలని, ప్రాజెక్ట్‌ల మెయింటెనెన్స్ మాన్యువల్ ప్రకారం జరగాలన్నారు.ప్రాజెక్ట్ సంబంధిత ఇంజినీర్లు కచ్చితంగా మాన్యువల్‌ను అమలుచేయాలని, ప్రాజెక్ట్‌ల సీఈలు, ఎస్‌సీలు ఈ సీజన్‌లో స్థానికంగా ఉండాల్సిందేనని ఆదేశించారు. ఉన్నతాధి కారుల అనుమతి లేకుండా ఇంజినీర్లు ప్రాజెక్ట్‌లు వదిలి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రాజెక్టుల మెయింటెనెన్స్, గేట్ల మరమ్మతులకు తక్షణమే నిధులు విడుదలచేస్తామని ప్రకటించారు. ఇరిగేషన్, మెట్రో వాటర్ బోర్డు, ఆర్‌డబ్ల్యూఎస్ అధి కారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.రైతు వేది కలను యూరియా పంపిణీ కోసం ఉపయోగించుకోవాలన్నారు. యూరియా పంపిణీ బాధ్య తను స్థానిక అగ్రికల్చర్ అధికారికి అప్పగించాలని, ఇందులో రెవెన్యూ సిబ్బందిని భాగస్వా మ్యం చేయాలని చెప్పారు. ఈనెల 1న రివ్యూ పెట్టి వర్షాలపై ముందస్తు సూచనలు ఇచ్చానని, ఈనెల 9న వర్షం సమయంలో అధికారులు సరిగా పని చేయలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. వర్షం సమయంలో క్యూర్ ఏరియాలో మునిసిపల్, పోలీస్ అధికారుల మధ్య సమన్వయం లేదని మండిపడ్డారు.వర్షం వచ్చినప్పుడు వాట ర్ లాకింగ్ పాయింట్స్, బ్లాక్ స్పాట్స్, ట్రాఫిక్ జామ్ ఏర్పడే ప్రాంతాల డేటా ఆధారంగా పనిచేయాలని ఆదేశించారు. విద్యుత్ శాఖ పూర్తిస్థా యిలో సన్నద్ధం కావాలని, ఫీల్డ్‌లో ఉండని అధికారులపై కఠిన చర్యలు తీసుకోలని సూచించా రు. వర్షం సమయంలో ట్రాఫిక్ ఉన్నతాధికారుల నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు రోడ్లపై ఉండాల్సిందేనని, అవసరమైతే తాను కూడా రోడ్డుపైకి వస్తానని వెల్లడించారు.



## జలధార పనులకు
# జూన్ డెడ్‌లైన్..

**గొలుసుకట్టు చెరువులకు పెద్దపీట: సీఎం చంద్రబాబు**

- గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణకు అత్యంత ప్రాధాన్యం
- జూన్ నెలాఖరులోగా పెండింగ్ పనులన్నీ పూర్తి చేయాలన్న సీఎం చంద్రబాబు
- నీటి సంరక్షణ పనుల్లో ప్రజల భాగస్వామ్యం పెంచాలని పిలుపు

**అమరావతి,జూన్14,**

జలధార-జలహారతి కార్యక్రమంలో భాగంగా గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణ, అభివృద్ధి పనులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. 2026 జూన్ నెలాఖరు నాటికి పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ పూర్తి చేయాలని ఆయన స్పష్టమైన గడువును నిర్దేశించారు. శనివారం జలవనరుల శాఖ, పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థలతో మంత్రి నిమ్మల రామానాయుడు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, సీఎంఓ కార్యదర్శి రాజమౌళి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు తన క్యాంపు కార్యాలయం నుండి పాల్గొన్నారు.

# అమరావతి పనులు ఆగలేదు..

- అమరావతి రాజధాని పనులు శరవేగంగా జరుగుతున్నాయన్న మంత్రి
- పనులపై జరుగుతున్న విష ప్రచారాన్ని ఆపాలని హితవు

**అమరావతి,జూన్14**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో నిర్మాణ పనులు శరవేగంగా, ఎక్కడా విరామం లేకుండా కొనసాగుతున్నాయని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. రాజధాని పనులు ఆగిపోయాయని, చిన్న వర్షానికే మునిగిపోతోందని కొందరు చేస్తున్న విష ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు నిర్మాణ పనుల పురోగతిని చూపిస్తూ ఆయన తన 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతాలో ఒక వీడియోను పోస్ట్ చేశారు."అమరావతిలో పనులు ఏమాత్రం ఆగడం లేదు. వర్షం కురిస్తే మునిగిపోయిందంటూ కొందరు ప్రచారం చేస్తున్నారు. కానీ, నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయి.



# గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుకు మద్దతు

- గోదావరి వరద జలాలపై ఏపీకి సంపూర్ణ హక్కులున్నాయన్న రిటైర్డ్ ఇంజనీర్ల సంఘం
- గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుకు మద్దతుగా సీఎం చంద్రబాబుకు లేఖ
- ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం మిగులు జలాలను వాడుకునే స్వేచ్ఛ ఏపీకి ఉందని వెల్లడి

**అమరావతి,జూన్14**

గోదావరి నది వరద జలాలపై దిగువ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌కు పూర్తి హక్కులు ఉన్నాయని, ఆ నీటిని వినియోగించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు సమర్థనీయమని ఏపీ జలవనరుల శాఖ విశ్రాంత ఇంజనీర్ల సంఘం స్పష్టం చేసింది. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు ఎం.విశ్వేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి నరసింహమూర్తి నిన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు లేఖ రాశారు.గోదావరి జల వివాదాల (ట్రిబ్యునల్) 1978లో వెలువరించిన తీర్పును వారు తమ లేఖలో ప్రస్తావించారు. ఎగువ రాష్ట్రాలకు ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు పోగా,




దిగువకు ప్రవహించే మిగులు వరద జలాలను వాడుకునేందుకు ఆంధ్రప్రదేశ్‌కు సంపూర్ణ స్వేచ్ఛ ఉందని వారు తెలిపారు. అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాల చట్టం-1956 ప్రకారం, ఈ మిగులు జలాల వినియోగంపై కేంద్ర ప్రభుత్వం గానీ, ఎగువ రాష్ట్రాలు గానీ అభ్యంతరం తెలిపే అధికారం లేదని వారు తేల్చిచెప్పారు.

## దేశంలో స్టార్టప్ వ్యవస్థ
# మరింత విస్తరిస్తుంది

**ఫ్రాన్స్‌లో మోదీ పర్యటన.. మేక్రాన్‌తో కలిసి చారిత్రక 'విల్లా కెర్లియోస్' సందర్శన**

**ఇంటర్నెట్ న్యూస్,జూన్14**

ప్రధాని నరేంద్ర మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ఆదివారం ఫ్రాన్స్‌లోని నీస్ నగరంలో ఉన్న చారిత్రక 'విల్లా కెర్లియోస్'ను సందర్శించారు. ఈ సందర్భంగా ఇద్దరు నేతలు తేలికపాటి సంభాషణలో మునిగిపోయారు. విల్లాను కలియతిరుగుతూ ఆత్మీయంగా మాట్లాడుకున్నారు.విల్లా కెరిలోస్ అనేది 20వ శతాబ్దం ప్రారంభంలో నిర్మించిన ఒక అసాధారణమైన హౌస్ మ్యూజియం.క్రీస్తుపూర్వం 2వ శతాబ్దానికి చెందిన ఒక



ప్రాచీన గ్రీకు ఉన్నత కుటుంబ నివాసాన్ని నమూనాగా తీసుకుని, ఎంతో నిశితంగా ఆధునిక కాలంలో దీన్ని పునఃసృష్టించారు. ఫ్రాన్స్‌లోని ఫ్రెంచ్ రివేరా తీరంలో, నైస్ మరియు మొనాకో నగరాల మధ్య ఉన్న బ్యూలీ-సర్-మెర్ అనే ప్రాంతంలో ఈ విల్లా ఉంది.



## అమెరికా-ఇరాన్ చారిత్రాత్మక
# శాంతి ఒప్పందం

- అమెరికా-ఇరాన్ మధ్య నేడు చారిత్రక ఒప్పందం ఉండబోతోందన్న ట్రంప్

**ఇంటర్నెట్ న్యూస్,జూన్14**

ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఇంధన సంక్షోభానికి తెరదించే కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా, ఇరాన్ మధ్య చారిత్రాత్మక శాంతి ఒప్పందం కుదిరిందని, ఆదివారమే సంతకాలు జరగనున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. "చారిత్రక ఒప్పందంపై నేడు సంతకాలు జరగనున్నాయి.

## మీనాక్షి నటరాజన్‌కు
# వెన్నుపోటు పొడిచింది రేవంత్ రెడ్డే

- మీనాక్షి నటరాజన్‌పై రేవంత్ కుట్ర అంటూ కేటీఆర్ వ్యాఖ్యలు
- ఆమెకు రాజ్యసభ సీటు రాకుండా బీజేపీతో రేవంత్ కుమ్మక్కయ్యారని ఆరోపణ
- కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైందని విమర్శలు
- ఖైరతాబాద్‌లో ఉపఎన్నిక రావడం ఖాయమని జోస్యం
- ఓటర్ల జాబితాపై అప్రమత్తంగా ఉండాలని పార్టీ శ్రేణులకు పిలుపు

**హైదరాబాద్,జూన్14**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. సొంత పార్టీ నేత, రాహుల్ గాంధీకి సన్నిహితురాలైన మీనాక్షి నటరాజన్‌కు రేవంత్ రెడ్డి వెన్నుపోటు పొడిచారని, ఆమెపై తప్పుడు కేసు బనాయించి వేధించారని విమర్శించారు. ఆమెకు మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ సీటు రాకుండా అడ్డుకునేందుకు బీజేపీతో కుమ్మక్కయ్యారని ఆరోపించారు.ఆదివారం ఖైరతాబాద్ నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. రేవంత్ రెడ్డి అవినీతి, భూ ఒప్పందాలపై మీనాక్షి నటరాజన్ కాంగ్రెస్ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారని, దీనికి ప్రతీకారంగానే హైదరాబాద్‌లో ఆమెపై తప్పుడు కేసు



పెట్టించారని అన్నారు. సొంత పార్టీ నేతలనే వెన్నుపోటు పొడిచే నైజం రేవంత్ రెడ్డిదని ఆయన దుయ్యబట్టారు. హిట్లర్ తన ఆదర్శం అని సీఎం చెప్పడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు.కాంగ్రెస్ పాలనను 'అట్టర్ ఫ్లాప్ సినిమా'గా అభివర్ణించిన కేటీఆర్, ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైందని అన్నారు. ఏడాదికి 2 లక్షల ఉద్యోగాల హామీ ఏమైందని, కనీసం 4,000 ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదని ప్రశ్నించారు.

## భద్రాద్రి'జలనిధి'..రోళ్ళపాడు'ద్వీప'సిరి

# గిరిజన పల్లెల్లో పర్యాటక విప్లవం!

- అటు రైతన్నలు.. ఇటు పర్యాటకులు.. మధ్యలో మత్స్యకారుల సిరులు!
- సీతారామ ప్రాజెక్టు పూర్తితో మారనున్న టేకులపల్లి ముఖచిత్రం
- రోళ్ళపాడును పర్యాటక కేంద్రంగా మార్చాలని గ్రామస్తుల ఏకగ్రీవ డిమాండ్



నమస్తేభారత్:టేకులపల్లి,జూన్ 14:

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,టేకులపల్లి మండలంలోని రోళ్ళపాడు గ్రామపంచాయతీ పరిధిలో ప్రకృతి ప్రసాదించిన అపురూప వరప్రసాదమైన 'రోళ్ళపాడు ద్వీపం'నేడు అన్వేషించని ఒక పర్యాటక వజ్రంలా మెరుస్తోంది. ప్రతిష్టాత్మక 'సీతారామ ఎత్తిపోతల పథకం'జలాల కలయికతో ఈ ప్రాంతం సరికొత్త జలకళను సంతరించుకుంది. దట్టమైన అరణ్యం,చు ట్టూ స్వచ్ఛమైన జలరాశి,మధ్యలో ఆకుపచ్చని ద్వీపంతో అలరారుతు న్న ఈ ప్రాంతాన్ని గనుక ప్రభుత్వం పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తే అటు రైతాంగానికి,ఇటు మత్స్యకారులకు మరియు స్థానిక గ్రామ స్తులకు ఒక అద్భుతమైన ఆర్థిక వరప్రసాదంగా మారనుంది.**



**మత్స్యకారులకు అండగా-ఇప్పటికే సాగుతున్న చేపల పెంపకం:**
రోళ్ళపాడు జలాశయం ఇప్పటికే మత్స్యకారులకు జీవనాధారం గా నిలిచింది.ఇక్కడ ప్రస్తుతం ముమ్మరంగా సాగుతున్న చేపల పెంపకం ద్వారా ఎన్నో కుటుంబాలు ఉపాధి పొందు తున్నాయి. రాబోయే రోజుల్లో సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలు ఇక్కడికి పూర్తి స్థాయిలోచేరు కుంటే,నీటి నిల్వ సామర్థ్యం మరింత పెరిగి మత్స్య సంపద రెట్టింపు అవుతుంది.దీనివల్ల స్థానిక మత్స్యకార సొసైటీల కు,గిరిజన కుటుంబాలకు చేతినిండా పని దొరికి,ఆర్థికంగా మరింత బలోపేతం కానున్నారు.

**రైతాంగానికి సుజల స్రవంతి - పంటల పండుగ:**
ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కావడం టేకులపల్లి మండల రైతాంగం పాలిట కల్పవృక్షం కానుంది.ఎడారిని తలపించే మెట్ట భూములు సైతం గోదావరి జలాలతో తడిసి ముద్దవుతాయి.ఏటా రెండు పంటలు సమృద్ధిగా పండించుకునే అవకాశం లభించడమే కాకుండా,పరివాహక ప్రాంతంలో భూగర్భ జలమట్టం భారీగా పెరుగుతుంది.బావులు,వాగులు ఎల్లప్పుడూ నిండుకుండలా మారడం వల్ల రైతుల దశాబ్దాల సాగునీటి కష్టాలు శాశ్వతంగా తీరిపోతాయి.

**పర్యాటకులకు స్వర్గధామం-గ్రామస్తులకు శాశ్వత ఆదాయం:**
రోళ్ళపాడు ద్వీపాన్ని ఒక అధికారిక పర్యాటక కేంద్రంగా మార్చడం వల్ల గ్రామస్తుల ఆర్థిక వ్యవస్థ రూపురేఖలే మారిపోతాయి.పర్యాటకుల ద్వారా వచ్చే ప్రవేశ రుసుము,పార్కింగ్ ఛార్జీలతో గ్రామపంచాయతీకి శాశ్వత ఆదాయం సమకూరు తుంది.ఈ నిధులతో గ్రామంలో అంతర్గత సిమెంట్ రోడ్లు,తాగు నీరు,హైటెక్ పారిశుద్ధ్య పనులను సొంతంగానే అద్భుతంగా నిర్వహించుకోవచ్చు.వందలాది గిరిజన యువతకు బోటింగ్ నిర్వహణ,టూరిస్ట్ గైడ్‌లుగా స్థానికంగానే ఉపాధి లభిస్తుంది.గిరిజన మహిళలు సేకరించే స్వచ్ఛమైన తేనె,హస్తకళలతో పాటు స్థానిక రైతులు పండించే తాజా కూరగాయలు,పండ్లను పర్యాటకులకు నేరుగా అమ్ముకునే వీలుంటుంది.దీనివల్ల రైతులకు దళారీల బాధ తప్పుతుంది.రోళ్ళపాడుకు నీరందించే సీతారామ కాలువల పనులను,ప్రాజెక్టు మిగిలిన నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి.అటవీ మార్గం గుండా రోళ్ళపాడుకు చేరుకునే దారిని తక్షణమే పక్కా బి.టిరహదారిగా మార్చాలి.ఇది పర్యాటకులతో పాటు,రైతులు తమ పంటలను,మత్స్యకారులు తాము పట్టిన చేపలను మార్కెట్‌కు త్వరగా తరలించడానికి ఎంతో ఉపయోగపడుతుంది.పర్యావరణానికి ఎలాంటి ముప్పు కలగకుండా ద్వీపంపై వెదురు పొదలతో కాటేజీలు,వాటర్ స్పోర్ట్స్ మరియు సురక్షితమైన వ్యూ పాయింట్లను ఏర్పాటు చేయాలి.



**చీమల రాము**
**(రోళ్లపాడు వాసి)**

రోళ్ళపాడు ద్వీపం మరియు సీతారామ ప్రాజెక్టు పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందితే,అది కేవలం ఒక సాధారణ సందర్శనీయ స్థలంగా మాత్రమే మిగిలిపోదు.అది టేకులపల్లి మండలంలోని వందలాది గిరిజన కుటుంబాల జీవితాల్లో,వేలాది మంది రైతుల ఇళ్లల్లో సరికొత్త వెలుగులు నింపే ఒక గొప్ప ఆశాదీపం.ఒకవైపు పచ్చని పంటలు...మరోవైపు పరవళ్లు తొక్కే పర్యాటకం...వెరసి టేకులపల్లి మండలంలో ఒక గొప్ప ఆర్థిక,వ్యవసాయ విప్లవం రావడం ఖాయం.ప్రభుత్వం మరియు ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకుని ఈ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.
"నా దృష్టిలో అభివృద్ధి అంటే కేవలం కాంక్రీటు కట్టడాలు కాదు...ప్రకృతిని కాపాడుకుంటూనే మనిషికి ఉపాధిని చూపడం.రోళ్ళపాడుకు ఆ శక్తి ఉంది.
అభివృద్ధి అనేది మన ముంగిట ఉన్నప్పుడు,దానిని అందిపు చ్చుకోవడంలో మనం వెనుకబడితే,అది మన ప్రాం తానికే కాదు...రేపటి తరానికి మనం చేసే అన్యాయం.ఒక సామాన్య పౌరుడిగా నేను కోరుకునేది ఒక్కటే..రోళ్ళపాడు అభి వృద్ధి కేవలం ఫైళ్లకే పరిమితం కాకూడదు.అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి అడుగు వేస్తే,ఈ అడవిలోని అందం లోకానికి తెలుస్తుంది..మా పల్లె కన్నీళ్లు తుడువబడతాయి.మన గడ్డపై ఉన్న సంపదను మనమే కాపాడుకుందాం.. అభివృద్ధి పథంలో ముందుకు నడిపిద్దాం...!"

# ప్రైవేట్ పాఠశాలల పుస్తకాల దందాను ఆపాలి

## మాల మహానాడు జిల్లా అధ్యక్షులు బేగరి మహేష్



నమస్తే భారత్ షాద్ నగర్ జూన్ 14:రంగారెడ్డి జిల్లా: ప్రైవేట్ పాఠశాలల్లో కొనసాగుతున్న పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలు, బ్యాగులు, షూస్ విక్రయాల దందాపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని మాల మహానాడు రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బేగరి మహేష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రైవేట్ స్కూల్స్‌లో విద్యార్థుల తల్లిదండ్రులను బలవంతంగా స్కూల్ యాజమాన్యం సూచించిన షాపుల నుంచే పుస్తకాలు, స్టేషనరీ సామగ్రి కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. మార్కెట్‌లో లభించే పుస్తకాల కంటే 30 నుంచి 60 శాతం వరకు అధిక ధరలకు విక్రయిస్తూ తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నారని పేర్కొన్నారు. అదే విధంగా కొన్ని పాఠశాలలు తమ లోగోతో పుస్తకాలు ముద్రించి అధిక ధరలకు విక్రయిస్తున్నాయని, పాత పుస్తకాలను కూడా కొత్తవిగా చూపించి అమ్ముతున్న సందర్భాలు ఉన్నాయని తెలిపారు. ఒక్కో విద్యార్థిపై సంవత్సరానికి రూ.8,000 నుంచి రూ.15,000 వరకు పుస్తకాలు, నోట్‌బుక్స్, స్టేషనరీ పేరుతో అదనపు భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పర్మిషన్ లేని ప్రైవేట్ పాఠశాలలపై కూడా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. రేపటి నుంచి అన్ని ప్రైవేట్ స్కూల్స్‌లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అక్రమ వసూళ్లు,
పుస్తకాల దందాను అరికట్టాలని విద్యా అధికారులను కోరారు.ప్రైవేట్ పాఠశాలలు విద్యను అందించే కేంద్రాలుగా ఉండాలే గానీ వ్యాపార సంస్థలుగా మారకూడదని, విద్యను లాభార్జన సాధనంగా మార్చడం సమాజానికి హానికరమని అన్నారు. తల్లిదండ్రులు కూడా మేల్కొని తమ హక్కుల కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

# ప్రైవేట్ స్కూల్స్ బుక్స్ దందా ఆపాలి

## ఇది ఒక్క పుస్తకాలతో ఆగదు నోట్ బుక్స్, బ్యాగ్స్, యూనిఫామ్, షూస్ వరకు ఈ దందా...?



**నమస్తే భారత్ షాద్ నగర్ జూన్ 14:** పర్మిషన్ లేని ప్రైవేట్ స్కూల్స్ పై చర్యలు తీసుకోవాలి.ఎస్ఎఫ్ఐ షాద్ నగర్ డివిజన్ కార్యదర్శి వడ్ల శ్రీకాంత్ అధికారులు ఇప్పటికైనా మేల్కొనాలి రేపటి నుండి అన్ని స్కూల్స్ లో తనిఖీ లు నిర్వహించాలి పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్ ప్రతి సంవత్సరం పిల్లలను బలవంతంగా స్కూల్ నుంచి లేదా స్కూల్ సూచించిన షాపుల నుంచి మాత్రమే ఖరీదైన పుస్తకాలు కొనాల్సిన పరిస్థితి ఉంది. ఇది స్పష్టమైన వ్యాపార దందా. దీన్ని వెంటనే ఆపాలి స్కూల్స్ తమ సొంతం లేదా భాగస్వామ్య ఎంపిక చేసిన పబ్లిషర్లతో ఒప్పందాలు చేసుకుంటాయి. మార్కెట్‌లో లభించే అదే పుస్తకాల కంటే 30-60% ఎక్కువ ధరకు విక్రయిస్తారు.
పాత పుస్తకాలను కూడా కొత్తవిగా లెక్కించి, రీప్రింట్ చేసి అమ్ముతారు స్కూల్ పుస్తకాలు మాత్రమే ఉపయోగించాలి" అని బలవంతం చేస్తారు. వేరే చోట నుంచి తెచ్చినా అనుమతించరు మధ్యతరగతి కుటుంబాలుసంవత్సరానికి వేల రూపాయలు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తుంది. ఒక్క పిల్లవాడికి 8,000 నుంచి 15,000 రూపాయల వరకు బుక్స్ ఢ స్టేషనరీ మీదే వెళ్తుంది. అదే ఎన్ సి ఇ ఆర్ టి లేదా స్టేట్ సిలబస్ పుస్తకాలు మార్కెట్‌లో సగం ధరకు దొరుకుతాయి. కానీ స్కూల్ లోగో పెట్టి అమ్ముతారు.దీనిపై వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలి అని ఎస్ఎఫ్ఐ గా డిమాండ్ చేస్తున్నాము

# గంజాయిపై సమరం...

**అమరావతి,:** రాష్ట్రంలో గంజాయి 'భూతం' జడలు విప్పి కరాళంగా నర్తిస్తున్నదనడానికి ప్రత్యక్ష సాక్ష్యం నెల్లూరులో పట్టపగలు యువ కళాకారుడు, సిపిఎం కార్యకర్త పెంచలయ్య దారుణ హత్య. గంజాయి, మాదక ద్రవ్యాల బారిన పడకుండా స్థానిక యువతను, ప్రజలను చైతన్యపరుస్తున్న యువ నేతను మాఫియా ముఠాలు కత్తులతో వెంబడించి చంపడం పట్ల రాష్ట్రం ఉలిక్కిపడింది. గంజాయి అక్రమ వ్యాపారాన్ని ఎదిరించి అడ్డుకోవడం సంఘ విద్రోహ ముఠాలకు కంటగింపుగా మారినందునే పెంచలయ్యను కిరాతకంగా ఒక పథకం ప్రకారం అంతమొందించారు. అఘాయిత్యానికి కారకులెవరో కొద్దిసేపట్లోనే పోలీస్ అధికారులు పూసగుచ్చినట్లు వల్లెవేశారు. ప్రధాన నిందితురాలైన మహిళా డాన్ అరవ కామాక్షి, మరికొంత మంది నిందితులను అరెస్టు చేశారు. గంజాయి, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ, పోలీసులతో కూడా కలిసి పెంచలయ్య కొన్ని ప్రత్యేక కళారూపాల ప్రదర్శనలతో ప్రచారం చేశారు కాబట్టి నిజా నిజాలు సులభంగానే పోలీసులు తెలుసుకోగలుగుతారు. పెంచలయ్య హత్యతోనే నెల్లూరులో గంజాయి బ్యాచ్ నేరాలు లోకానికి తెలిసిందనుకోవడానికి వీల్లేదు. గతంలో నెల్లూరులో గంజాయి అక్రమ రవాణాను అడ్డుకోడానికి ప్రయత్నించిన పోలీసులపై మాఫియా ముఠాలు ఎదురుదాడి చేసి ఉడాయించారు. మాఫియా దాడుల్లో పోలీసులు గాయపడ్డారు కూడా. పెంచలయ్య హత్య అనంతరం ఖాకీలు హంతకులను పట్టుకొనేందుకు వెళ్లగా పోలీసు కానిస్టేబుల్‌పై కత్తులతో దాడి చేశారు.

# అబ్బాయిపాలెం మిషన్ భగీరథ ప్లాంట్ అధ్యక్షులు రాయల శ్రీను



నమస్తే భారత్ :-మరిపెడ మిషన్ భగీరథలో గత 12 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు కావడం లేదని, తమ న్యాయమైన హక్కుల సాధన కోసం కార్మికులందరూ ఐక్యంగా పోరాడాలని మిషన్ భగీరథ ప్లాంట్ అధ్యక్షులు రాయల శ్రీను పిలుపునిచ్చారు.మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం అబ్బాయిపాలెం మిషన్ భగీరథ ప్లాంట్‌లో ఆదివారం కార్మికుల సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నారు.
ఈ సందర్భం గా మాట్లాడిన రాయల శ్రీను, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికుల సంక్షేమం, వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత వంటి అంశాలపై కమిటీ ప్రత్యేక దృష్టి సారిస్తుందని తెలిపారు.
ఈ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకోగా, అధ్యక్షుడిగా రాయల శ్రీను, ఉపాధ్యక్షుడిగా గూడూరు మల్లేశం, ప్రధాన కార్యదర్శిగా సైదులు వెంకట్, కోశాధికారిగా సైదులు అనిల్,
కార్యదర్శిగా కావల్లి దయాకర్, స్టేట్ మీడియా అడ్వైజర్‌గా బాబోత్ నవీన్ ఎన్నికయ్యారు. వీరితో పాటు 30 మంది సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. కాగా నూతన అధ్యక్షునిగా ఎన్నికైన శ్రీను ను కమిటీ సభ్యులుఅభినందించారు.

# హిల్ట్ పాలసీపై బిఆర్ఎస్ పోరుబాట..!

హైదరాబాద్: గ్రేటర్ పరిధిలోని రూ.5లక్షల కోట్ల విలువైన పారిశ్రామిక భూములను హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ హిల్ట్ పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకునేం దుకు బీఆర్ఎస్ సిద్ధమైంది. ఇందు లో భాగంగా పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్రవ్యాప్తంగా సీనియర్ నాయకులతో కూడిన నిజనిర్ధారణ బృందాలను నియమించారు. ఈ మేరకు పార్టీ ముఖ్య నేతలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల తో కేటీఆర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, క్షేత్రస్థాయి పర్యటనలపై దిశానిర్దేశర చేశారు.ఈ సందర్భం గా కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత ప్రభుత్వాలు పరిశ్రమల స్థాపన కోసం, ఉపాధి కల్పన కోసం అతి తక్కువ ధరకే కేటాయించిన భూములను, ఇప్పుడు 'మల్టీ యూజ్ జోన్' పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి మారుస్తున్నారని ఆరోపించారు.సుమారు 9,300 ఎకరాల భూములను మార్కెట్ విలువ కంటే అతి తక్కువకు, కేవలం ఎస్ఆర్ఓ రేటులో 30 శాతానికే రెగ్యులరైజ్ చేసి,సుమారు రూ.5లక్షల కోట్ల ప్రజాధనాన్నికొల్లగొట్టే కుట్ర జరుగుతోందని పేర్కొన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టడానికి, కనీసం స్మశాన వాటికలకు కూడా స్థలాలు లేవని చెబుతున్న ప్రభుత్వం, వేల కోట్లవిలువైన భూములను మాత్రం ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నదని మండిపడ్డారు.ప్రభుత్వ తీరును ఎండగట్టేందుకు హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న పారిశ్రామిక వాడలను 8 క్లస్టర్లుగా విభజించి, పార్టీ సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో బృందాలు పర్యటించనున్నాయి. అక్కడ స్థానిక నాయకులను, ప్రజలను కలుపుకొని వాస్తవ మార్కెట్ విలువకు,ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఉన్న భారీ వ్యత్యాసాన్ని ప్రజల ముందు ఉంచనున్నారు. వీటితో పాటు అక్కడి పారిశ్రామిక వాడల ద్వారాప్రజాఉపయోగ కార్యక్రమాలు ఏమేమి చేయవచ్చు, అక్కడి స్థానిక ప్రజల సుదీర్ఘకాలం డిమాండ్లను ఆకాంక్షలను కూడా పార్టీ నేతలు తెలుసుకోనున్నారు. ఒకప్పుడు అక్కడ పారిశ్రామిక వాడల ఏర్పాటు కోసం ప్రజలు భూములు ఇచ్చిన తీరును ప్రభుత్వం కేటాయించిన తీరును వాటిని అత్యంత చవకగా పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వాలు కట్టబెట్టిన అంశాన్ని, వాటి ఉద్దేశాలను పార్టీ నేతల బృందాలు ప్రస్తావించనున్నాయి.డిసెంబర్ 3, 4 తేదీల్లో హిల్ట్ పాలసీ స్కామ్‌పై నిజనిర్ధారణ కోసం బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన ఎనిమిది బృందాలు ఆయా ప్రాంతాల్లో పర్యటించనున్నాయి. ఇందులో భాగంగా..క్లస్టర్-1లో సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు నేతృత్వంలో మాజీమంత్రి గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మెదక్ ఎమ్మెల్యేల బృందం పాశమైలారం, పటాన్ చెరువు, రామచంద్రాపురం ప్రాంతాలను సందర్శించనున్నారు.క్లస్టర్-2లో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి నేతృత్వంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ సురభి వాణీ దేవి, ఉప్పల్ నాయకులు కలిసి నాచారం, మల్లాపూర్, ఉప్పల్, చర్లపల్లి ప్రాంతాల్లో పర్యటిస్తారు. క్లస్టర్-3లో శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి నేతృత్వంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావుతో కూడిన బృందం మౌలాలి, కుషాయిగూడ పారిశ్రామిక వాడల్లో పర్యటిస్తారు. క్లస్టర్-4లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్..మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానం దతో కలిసి జీడిమెట్ల, కూకట్‌పల్లి ప్రాంతాల్లో పర్యటించనున్నారు. క్లస్టర్-5లో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్,ఎమ్మెల్సీ నవీన్ రావు సనత్ నగర్, బాలానగర్ ఏరియా లను పరిశీలిస్తారు.క్లస్టర్-6లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు మేడ్చల్ ఇండస్ట్రియల్ పార్కుకు వెళ్తారు.క్లస్ట ర్-7లో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, స్వామి గౌడ్, మంచిరెడ్డి కిషన్ రెడ్డి,పటోళ్ల కార్తిక్ రెడ్డి..కాటేదాన్, హయత్‌నగ ర్‌లో పర్యటిస్తారు. క్లస్టర్-8లో మాజీ మంత్రి మహ్మూద్ అలీ,ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, చందులాల్‌తో కూడిన బృందం బారాదరి పారిశ్రామిక వాడను సందర్శించి వాస్తవ పరిస్థితులను పరిశీలిస్తారు.

# అమెరికా మిలిటరీ టెక్నాలజీకే ఎసరు

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టాక.. ఆయన తీసుకుంటున్న నిర్ణయాలతో ప్రపంచ దేశాలన్నీ అమెరికాకే వ్యతిరేకంగా మారుతున్నాయి. మరోవైపు అన్నీ తమకే కావాలన్న స్వార్థంతో ట్రంప్ ప్రపంచ దేశాలపై సుంకాల మోత మోగిస్తున్నారు. ప్రపంచంలో అరుదుగా లభించే ఎర్త్ మినరల్స్‌లో ఆధిపత్యం చెలాయిస్తున్న చైనాకు చెక్ పెట్టేందుకు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. చైనాపై భారీగా సుంకాలు విధిస్తున్నారు. దీంతో చైనా కూడా ఎక్కడా తగ్గడం లేదు. అగ్రరాజ్యానికే సవాల్ విసురుతోంది. తాజాగా తీసుకున్న నిర్ణయంతో అమెరికా మిలిటరీ టెక్నాలజీకే ఎసరు వచ్చేలా ఉంది. చెనా తాజాగా రేర్ ఎర్త్ ఎగుమతులపై నియంత్రణలు కఠినం చేసింది. ఈ లోహాలే ఆధునిక మిలిటరీ, సెమీకండక్టర్, గ్రీన్ ఎనర్జీ టెక్నాలజీలకు ప్రాణాధారం. అమెరికా, యూరప్, జపాన్ వంటి దేశాలు ఇప్పటి వరకు ఇవి ఎక్కువగా చైనాపై ఆధారపడ్డాయి. ఇప్పుడు బీజింగ్ పట్టుబిగించడంతో ఆ ఆధార వ్యవస్థే కదిలిపోయింది. రేర్ ఎర్త్ మెటల్స్ లో నియోడియమియం, ప్రాసియోడియమియం, డిస్ప్రోస్యియం వంటి లోహాలు ప్రధానమైనవి. వీటితో జెట్ ఇంజిన్లు, క్షిపణి నియంత్రణ వ్యవస్థలు, రాడార్ సెన్సర్లు, మొబైల్ ఫోన్లు నిర్మించబడతాయి. ప్రపంచంలోని సుమారు 70% సరఫరా చైనాకు చెందిన గనుల నుంచే వస్తుంది. ఒక గనిలో ఉత్పత్తిని తగ్గించినా ప్రపంచ మార్కెట్లో ధరలు క్షణాల్లో పెరుగుతాయి. టెక్నాలజీ ఆధిపత్యం కోసం ప్రతిదశలో చైనాకు సవాలు విసిరిన అమెరికా ఇప్పుడు రేర్ ఎర్త్ సరఫరాలో బంధింపబడిన స్థితిలో ఉంది. మిలిటరీ సాధనాలు, జాతీయ రక్షణ పరిశ్రమల ఉత్పత్తి ఆలస్యమవుతోంది. టెక్ కంపెనీలు ప్రత్యామ్నాయ మూలాలు కనుగొనడానికి ప్రయత్నిస్తున్నాయి. కాని తక్షణ పరిష్కారం లేదు. దీంతో వాషింగ్టన్ మళ్లీ భారత్ వంటి మిత్రదేశాల సహకారం కోసం చూస్తోంది. అమెరికా గతంలో వాణిజ్య టారిఫ్‌లతో భారత ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి తెచ్చింది. ఇప్పుడు ఆర్థిక పరిస్థితులు మారడం తో భారత్ సహకారం తప్పనిసరైంది. భారత్‌లోని ఆంధ్రప్రదేశ్, ఒడిశా, రాజస్థాన్‌లలో రేర్ ఎర్త్ ఖనిజ వనరులను అభివృద్ధి చేసే దిశగా ముందుకువెళ్తోంది. ఇది భారత్‌కు ద్విగుణ ప్రయోజనం. ఒకటి వ్యూహాత్మక చర్చల్లో ప్రాధాన్యం పెరగడం. రెండోది అంతర్జాతీ య పెట్టుబడులు ఆకర్షించగలగడం. చైనా "టెక్నాలజీ ఆయుధం"గా రేర్ ఎర్త్‌ను ఉపయోగించడం ప్రారంభించింది. దీంతోఅమెరికా, యూరప్ తమ పరిశ్రమల్లో కొరతను ఎదుర్కొంటున్నాయి. గ్రీన్ ఎనర్జీ (ఇవి వాడే బ్యాటరీలు, టర్బైన్‌లు) ప్రాజెక్టులు మందగిస్తున్నాయి. టెక్ మార్కెట్లలో అనిశ్చితి పెరిగింది. ఈ పరిణామాలు చైనా "సైలెంట్ వెపన్" ప్రభావాన్ని మరోసారి నిరూపిస్తున్నాయి. రేర్‌ఎర్త్ యుద్ధం కేవలంమినరల్ సప్లై పోరు కాదు.. ఇది భవిష్యత్తు టెక్నాలజీ ఆధిపత్యంపై పోరాటం. చైనా ఒకే నిర్ణయంతో ప్రపంచ సరఫరా గొలుసును కుదిపేసింది. భారత్ వంటి దేశాలు ఇప్పుడు వ్యూహాత్మకంగా కొత్త అవకాశాల సరిహద్దులో నిలిచాయి.

# అదానీ సేవలో తరిస్తున్న మోడీ సర్కార్




### భారత గ్రిడ్‌కు గొడ్డా ప్లాంట్ అనుసంధానం
### కొత్త ట్రాన్స్‌మిషన్ పవర్ లైన్‌కు మార్గం సుగమం

న్యూఢిల్లీ : భారత్‌కు చెందిన బడా వ్యాపారవేత్త అదానీ సేవలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పరితపిస్తోంది. ఆయనకు కష్టం వస్తే ఆదుకునేందుకు ముందుండే కేంద్ర ప్రభుత్వం.. మరోసారి దానిని నిరూపించింది. జార్ఖండ్‌లోని గొడ్డా థర్మల్ పవర్ ప్లాంట్‌ను ఇండియన్ నేషనల్ ఎలక్ట్రిసిటీ గ్రిడ్‌కు అనుసంధానించేందుకు లైన్ క్లియర్ చేసింది. ఇందుకు అదానీ పవర్ లిమిటెడ్ (ఎపిఎల్)కు అనుమతిని చ్చింది. అంతర్జాతీయ ఒప్పందం ప్రకారం ఇప్పటివరకు ఈ ప్లాంట్ నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్ మొత్తం బంగ్లాదేశ్‌కు సరఫరా అయ్యేది. ఇప్పుడు దీనిని భారత గ్రిడ్‌కు అనుసంధానిస్తూ మోడీ సర్కార్ గ్రీన్ సిగల్ ఇవ్వటం గమనార్హం. తాజా నిర్ణయంతో ఏపీఎల్ ఇప్పుడు గొడ్డా ప్లాంట్‌ను భారతదేశ ఇంటర్-స్టేట్ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్ (ఐఎస్‌టిఎస్)కు అనుసంధానించే కొత్త ట్రాన్స్‌మిషన్ లైన్ (పవర్‌లైన్) ను వేస్తుంది. ఇది రాష్ట్రాల మధ్య విద్యుత్‌ను తరలించే హై-వోల్టేజ్ జాతీయ గ్రిడ్. ఇది ఇప్పటికే ఉన్న కహల్గావ్ ఏ- మైథాన్ బి 400 కెవి లైన్‌కు లైన్-ఇన్-లైన్-అవుట్ (ఎల్ఐఎల్ఓ) కనెక్షన్‌ను ఉపయోగించి చేయబడుతుంది. ఈ ట్రాన్స్‌మిషన్ లైన్ గొడ్డా జిల్లాలోని 56 గ్రామాల గుండా వెళ్లనున్నది. మోడీ సర్కార్.. అదానీ పవర్‌కు కొన్ని న్యాయ అధికారాలనూ కట్టబెట్టింది. ఇండియన్ టెలిగ్రాఫ్ యాక్ట్, 1885 కింద టెలిగ్రాఫ్ అథారిటీకి ఉండే అధికారాలనే కేంద్రం అదానీ పవర్‌కు కల్పించింది. దీని అర్థం.. ప్రయివేటు ప్రాపర్టీ మీదుగా స్తంభాలు, లైన్లను వేసే అధికారం ఉంటుంది. అయితే దీనికి కొన్ని షరతులు ఉంటాయి. ఎలక్ట్రిసిటీ యాక్ట్, 2003లోని సెక్షన్ 164ను అనుసరించి ఈ అధికారాలను కట్టబెట్టారు.

కేంద్రం నిర్ణయంపై ఆందోళనలు: అయితే అదానీ పవర్‌కు మోడీ సర్కార్ మార్గం సుగమం చేసేలా అనుమతివ్వటంపై పలు అనుమానాలు, ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే.. గొడ్డా ప్లాంట్ స్పెషల్ ఎకనామిక్ జోన్ (సెజ్)లో ఉన్నది.

మార్చి, 2019లో అప్పటి కేంద్రం ప్రభుత్వమే ఈ ప్రకటన చేసింది. ప్రత్యేకించి బంగ్లాదేశ్‌కు విద్యుత్‌ను ఎక్స్‌పోర్ట్ చేసేందుకు ఈ ప్లాంట్‌ను నిర్మించారు. అయితే గతేడాది ఆగస్ట్‌లో బంగ్లాదేశ్‌లో అక్కడి ప్రభుత్వం మారింది. కొత్త వచ్చిన తాత్కాలిక ప్రభుత్వం గొడ్డా ప్లాంట్ నుంచి విద్యుత్ కొనుగోలును తగ్గించటం, లేదా ఆపేయటం చేసింది. దీంతో బంగ్లాదేశ్‌కు అవసరం లేకుంటే.. వినియోగంలో లేని ఈ విద్యుత్‌ను భారత్‌లో విక్రయించటానికి అనుమతి కోసం అదానీ పవర్ అభ్యర్థించింది. అదానీ పవర్ కోసం పలు ప్రభుత్వ ఏజెన్సీలు కదిలాయి. నిబంధనలు, మార్గదర్శకాలను సవరించాయి.

కదిలిన ప్రభుత్వ యంత్రాంగాలు..మారిన నిబంధనలు, మార్గదర్శకాలు: భారత్‌లో విద్యుత్ విక్రయానికి అనుమతి కోసం గతేడాది ఆగస్ట్‌లో అదానీ కంపెనీ అనుమతి కోరింది. దీంతో విద్యుత్ మంత్రిత్వ శాఖ క్రాస్-బోర్డర్ ఎలక్ట్రిసిటీ ట్రేడ్ గైడ్‌లైన్స్‌ను గతేడాది ఆగస్ట్‌లో సవరించింది. ఇక గతేడాది ఆగస్ట్‌లోనే కేంద్ర విద్యుత్ సంస్థ (సిఇఎ) కూడా తన సాంకేతిక నిబంధనలను మార్చింది. కేంద్ర విద్యుత్ నియంత్రణ కమిషన్ (సిఇఆర్‌సి) సైతం తన నియమాలను అదే ఏడాది డిసెంబర్‌లో సవరించింది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో కేంద్రం ట్రాన్స్‌మిషన్ కనెక్షన్‌కు అధికారికంగా ఆమోదం తెలిపింది. తాజాగా కేంద్రం గ్రీన్ సిగల్ ఇవ్వటంతో అదానీ గొడ్డా ప్లాంట్ నుంచి భారత గ్రిడ్‌కు విద్యుత్ సరఫరాకు మార్గం సుగమమైంది. ఈ అనుమతి 25 ఏండ్ల పాటు చెల్లుబాటు అవుతుంది. ఎపిఎల్.. రైల్వే, రహదార్లు, ఏవియేషన్, రక్షణ వంటి స్థానిక, జాతీయ సంస్థల నుంచి తప్పక అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ ట్రాన్స్‌మిషన్ రూట్ అనేది జిఐబి ప్రొటెక్టెడ్ జోన్స్ గుండా వెళ్తే.. కంపెనీ సుప్రీంకోర్టు జారీ చేసిన పర్యావరణ నిబంధనలను తప్పక పాటించాల్సి ఉంటుంది.

ప్లాంట్ నేపథ్యం: అదానీకి చెందిన గొడ్డా ప్లాంట్ 1600 మెగావాట్ల సామర్థ్యం కలిగిన థర్మల్ పవర్ స్టేషన్. ఇది జారండ్‌లోని గొడ్డాలో ఉన్నది. ఇది భారతదేశపు మొట్టమొదటి అంతర్జాతీయ విద్యుత్ ప్రాజెక్ట్. దీని ప్రధాన లక్ష్యం బంగ్లాదేశ్‌కు విద్యుత్‌ను సరఫరా చేయడం. ఈ ప్లాంట్ అదానీ గ్రూప్ అనుబంధ సంస్థ అయిన అదానీ పవర్ ద్వారా నిర్వహించబడుతోంది. 2019లో ఈ ప్లాంట్‌ను స్పెషల్ ఎకనామిక్ జోన్‌గా ప్రకటించారు. దీంతో పన్నులు, సుంకాలపై గణనీయమైన రాయితీలను ఈ ప్లాంట్ పొందింది. బంగ్లాదేశ్ పవర్ డెవలప్‌మెంట్ బోర్డు (బిపిడిబి)తో చేసుకున్న దీర్ఘకాలిక ఒప్పందం ప్రకారం ఈ ప్లాంట్ బంగ్లాదేశ్‌కు విద్యుత్‌ను సరఫరా చేస్తోంది. 2023లో ఇది పూర్తిస్థాయి వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించింది. 2024 ఆగస్ట్‌లో బంగ్లాదేశ్‌లో పాలనా మార్పుల తర్వాత.. మోడీ ప్రభుత్వం ఈ ప్లాంట్‌ను భారతీయ పవర్ గ్రిడ్‌కు తాత్కాలికంగా అనుసంధానిం చడానికి అనుమతినిచ్చింది. బంగ్లాదేశ్ నుంచి డిమాండ్ తక్కువగా ఉన్నప్పుడు లేదా చెల్లింపుల్లో సమస్యలు తలెత్తినప్పుడు ఈ ప్లాంట్ నుంచి భారత్‌లోని గ్రిడ్‌కు విద్యుత్ సరఫరా చేయడానికి ఇది వీలు కల్పించింది. కేంద్రం తాజా ఆమోదంతో ఈ అనుసంధానానికి 25 ఏండ్ల పాటు శాశ్వత ఆమోదం లభించినట్టయ్యింది. గొడ్డా ప్లాంట్‌పై పలు వివాదాలు: అదానీ గొడ్డా ప్లాంట్‌పై ఇప్పటికే అనేక వివాదాలు ఉన్నాయి. బంగ్లాదేశ్‌లో ఈ ప్లాంట్ నుంచి అధిక ధరకు విద్యుత్ కొనుగోలు చేయడంపై విమర్శలు వచ్చాయి. ఇక భూసేకరణ చట్టం-2013 ను ఉల్లంఘించి మరీ బలవంతంగా భూములను స్వాధీనం చేసుకున్నారనే ఆరోపణలూ వెల్లువెత్తాయి. ఆ సమయంలో స్థానిక రైతులు, గిరిజనులు దీనిపై నిరసనలు కూడా చేశారు. ఈ ప్లాంట్ నిర్మాణంతో పర్యావరణ కాలుష్యం పెరుగుతుం దనీ, కార్మికులకు సరైన ఉపాధి ప్పందాలు లేవని పర్యావరణవేత్తలు, కార్మిక సంఘాల నుంచి ఆందోళనలూ వ్యక్తమయ్యాయి. ఇక విద్యుత్ ఎక్స్‌పోర్ట్ కోసం సెజ్ హోదా పొందినప్పటికీ.. ఈ ప్లాంట్ దేశీయంగా విద్యుత్‌ను విక్రయించేందుకు నిబంధనలను మార్చడం అదానీ గ్రూపునకు మాత్రమే లబ్ధిని చేకూరుస్తుందని విశ్లేషకులు, మేధావులు ఆరోపిస్తున్నారు.

# గ్రామపంచాయతీల పునర్ వ్యవస్థీకరణ!



### - 359 రూర్బన్ పంచాయతీల ఏర్పాటు
### - కార్యదర్శుల పోస్టులను పిడిఒగా మార్పు
### - ఉద్యోగుల సర్వీసుల్లోనూ భారీగా మార్పులు

గుంటూరు : రాష్ట్రంలో గ్రామపంచాయతీల వ్యవస్థలో కీలకమైన మార్పులే తేవడానికి రాష్ట్ర ప్రభుత్వం ముమ్మర కసరత్తు చేస్తోంది. ప్రధానంగా పంచాయతీ కార్యదర్శుల వ్యవస్థలో పలు మార్పులకు సన్నద్ధమైనట్టు సమాచారం. పంచాయతీ కార్యదర్శుల్లో ప్రస్తుతం ఉన్న ఆరంచెల వ్యవస్థను నాలుగు అంచెల వ్యవస్థగా మార్పు చేయనున్నారు. ఈ ప్రతిపాదనకు ఈ నెల పదవ తేదిన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆవెూదం తెలిపారు. ఇందుకు సంబంధించి రాష్ట్రంలోని 26 జిల్లాల జిల్లా పంచాయతీ అధికారుల నుంచి సమగ్ర సమాచారాన్ని కూడా ఇప్పటికే ప్రభుత్వానికి చేరినట్లు సమాచారం, వచ్చే వారంలో దీనికి సంబంధించిన తుది ఉత్తర్వులు వెలువడనున్నా యని సమాచారం. నూతన వ్యవస్థలో గ్రామీణ స్థాయిలో అర్బన్ స్థాయి కలిగిన పంచాయతీలను స్పెషల్ గ్రేడ్ పంచాయతీలుగా పరిగణిస్తారు. వీటిని రూర్బన్ (రూరల్, అర్బన్ - ఆర్ అర్బన్) పంచాయతీలుగా నిర్దేశించారు. ఈ పంచాయతీల కార్యదర్శిని రూరల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా (ఆర్‌యుడిఒ) పిలుస్తారు. ప్రస్తుత 'ఎ' గ్రేడ్ పంచాయతీ కార్యదర్శులను ఆర్‌యుడిఒగా నియమిస్తారు. రూర్బన్ పంచాయతీలంటే పది వేల జనాభాపైన ఉండి మండల పరిధిలో అత్యధిక ఆదాయం కలిగి ఉండాలి. ఈ విధంగా రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 359 పంచాయతీలను ఇప్పటికే గుర్తించారు. ఈ పంచాయతీల కార్యదర్శులు గెజిటెడ్ హోదా కలిగి ఉంటారు. డిప్యూటీ ఎంపిడిఒలను కూడాఈ పంచాయతీలకు కార్యదర్శులుగా నియమించడానికి కసరత్తు జరుగుతోంది. ఇప్పటి వరకు గ్రామ పంచాయతీల్లో నాలుగు స్థాయిలో కార్యదర్శులుగా పనిచేస్తున్నారు. వీరితోపాటు ఆరేళ్ల క్రితం సచివాలయాల్లో ఎంపిక అయిన పంచాయతీ కార్యదర్శులను ఐదు, ఆరు కేటగిరిలో ఉంచారు. ఆరో కేటగిరి కార్యదర్శి చాలా సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్‌గా కంప్యూటర్‌కు సంబంధించిన అంశాల్లో వినియోగిస్తున్నారు. మొత్తం ఆరెంచల వ్యవస్థను నాలుగు అంచెలుగా మారుస్తున్నారు.

రద్దు కానున్న క్లస్టర్ విధానం: ఈ మార్పులతో ఇప్పటి వరకు ఉన్న గ్రామ పంచాయతీల క్లస్టర్ విధానం రద్దు కానుంది. ప్రస్తుతం ఉన్న 7,244 క్లస్టర్ పంచాయతీల విధానాన్ని రద్దు చేసి, 13,351 గ్రామ పంచాయతీలను స్వతంత్ర పరిపాలనా యూనిట్లుగా ఏర్పాటు చేస్తారు. గ్రామ పంచాయతీలకు గ్రేడింగ్ విధానం కొత్తగా తీసుకొస్తున్నారు. నూతనంగా ఏర్నాటు కానున్న రూర్బన్ పంచాయతీలకు రూరల్ అర్బన్ డెవలప్‌మెంట్ ఆఫీసరుగా గ్రేడ్-1 కార్యదర్శులను నియమిస్తారు. రూర్బన్ పంచాయతీలు కాకుండా మిగిలిన పంచాయతీలను మూడు గ్రేడులుగా పునర్వర్గీకరణ చేస్తారు. ఈ మేరకు పంచాయతీల్లోని ఉద్యోగులు, అధికారుల పోస్టుల అప్‌గ్రేడేషన్, పునర్వ్యవస్థీకరణకు జిల్లాల నుంచి ప్రభుత్వం ఇటీవల ప్రతిపాదనలు స్వీకరించింది. ఆయా పోస్టులకు ప్రత్యేక స్కేల్స్ నిర్ణయించింది. అదనపు ఆర్థిక భారం లేకుండా అధికారుల పేర్లు, హోదాను మార్పు చేయనున్నారు. ఇక మీదట పంచాయతీ సెక్రటరీ పోస్టు పేరును పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (పిడిఒ)గా మార్చనున్నట్లు సమాచారం, జూనియర్ అసిస్టెంట్ పోస్టుల అప్‌గ్రేడేషన్‌లో భాగంగా 1,097 సాంక్షన్డ్ స్ట్రెంగ్త్ నుండి 359 జూనియర్ అసిస్టెంట్/జూనియర్ అసిస్టెంట్-కమ్-బిల్ కలెక్టర్ పోస్టులను సీనియర్ అసిస్టెంట్ పోస్టులుగా ఉద్యోగోన్నతి కల్పించి రూర్బన్ పంచాయతీల్లో నియమిస్తారు ఉద్యోన్నతులకు శిక్షణ తప్పనిసరి చేసింది. ఇందులో భాగంగా ఇంటర్-కేడర్ ఉద్యోగోన్నతులకు రెండు వారాల సంస్థాగత శిక్షణ, ఒక సంవత్సరం ఆన్-జాబ్ శిక్షణ అవసరమని నిర్ణయించింది. వేతన స్కేలు మార్పు లేకుండా మినిస్టీరియల్ సిబ్బందికి ఫీల్డ్ అనుభవం, ఎగ్జిక్యూటివ్ సిబ్బందికి ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్‌లో శిక్షణ ఇస్తారు. కొత్తగా డిప్యూటీ ఎంపిడిఒలను ఎంపిక చేయనున్నారు. ఇందులో భాగంగా డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా నియమితులైన డిప్యూటీ మండల పరిషత్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు ఫౌండేషన్ శిక్షణ పూర్తయిన తర్వాత కనీసం మూడు సంవత్సరాల పాటు రూర్బన్ పంచాయతీల్లో పిడిఒలుగా సేవలందించాలని, గ్రామ పంచాయతీల పర్యవేక్షణలో నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి వీరు పాటుపడాలని నిర్ణయించారు. పంచాయతీల్లో డెడికేటెడ్ ఐటి విభాగం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సర్‌ప్లస్ డిజిటల్ అసిస్టెంట్లు, ఇతర అర్హత కలిగిన సిబ్బందిని ఉపయోగించి గ్రామ పంచాయతీ రికార్డులను, పరిపాలనా ప్రక్రియలను డిజిటలైజ్ చేయిస్తారు. వర్క్‌ఫ్లో ఆటోమేషన్, రియల్-టైమ్ పర్యవేక్షణకు ఒక డెడికేటెడ్ ఐటి విభాగాన్ని ఏర్పాటు చేయడానికి డిజిటల్ అసిస్టెంట్ల సేవలను వినియోగించుకుంటారు.

# రోడ్లపైనే మొక్కజొన్న

వరంగల్:రోడ్లపై మొక్కజొన్న పంటలు ఏంటి అనుకుంటున్నారా... నిజమే పంట పొలాల్లో పండించిన మొక్కజొన్న పంట రోడ్లపై కి ఎక్కుతుంది. మహమ్మదాబాద్ మండల పరిధిలో ఎన్ హెచ్ 167 రోడ్డు పక్కనే ఉన్న సర్వీస్ రోడ్లపై కొందరు రైతులు పండించిన మొక్కజొన్న పంట రోడ్లపై ఆరబెడుతున్నారు. ఇక్కడ వర కు బాగానే ఉన్నప్పటికీ రాత్రి సమయంలో న లుపు రంగు గల టార్పలిన్ కవర్లను మొక్కజొన్నపై కప్పి పెడుతున్నారు. రాత్రి స మయం కావడంతో కొంతమంది వాహనచోదకులు బ్లాక్ కవర్ కనిపించకపోవడంతో మొక్కజొన్న కుప్పలు కు తగిలి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటువంటి ఘటనలు మండల పరిధిలో ఇప్పటికే చోటుచేసుకుని ఆసుపత్రి పాలు అయ్యేంద్రు. ఆరబెట్టెందుకు సర్వీస్ రేట్లను ఉపయోగించుకుంటున్న కొం తమంది రైతులు వారు వాహన చోదకులకు ఎంత మేరకు ఇబ్బందులు పెడుతున్నారో వారికి తెలియకుండానే ప్రమాదాలకు కారణమవుతున్నారు. వేగంగా వాహనాలు... అ సలే ఎన్ హెచ్ 167 రాత్రి సమయంలో వా హనాలు కొంత వేగం గానే ఉంటాయి. ఈ తరుణంలో కొంత మేరకు పక్కకు జరిగిన ప లు ప్రాంతాలలో పక్కనే ఉన్న మొక్కజొన్న కుప్పలకు తలి తీవ్ర ప్రమాదాలు చోటు చే సుకుంటున్నాయి. వాహన చోదకులు మొరపెట్టుకుంటున్నప్పటికీ ఎవరికి చెప్పాలి ఎవ రు తీస్తారులే అనుకుంటూ లోలోపలనే మ దిన పడుతుంద్రు. మహబూబ్ నగర్ నుంచి తాండూర్, కోస్గి, చించోలి ముంబై తో పాటు పలు ప్రాంతాలకు ఈ రోడ్డు మీదుగా వాహనాలు వెళుతుంటాయి. ఎలాగైనా రైతులకు రోడ్లపై మొక్కజొన్నలు ఉంచకుండా పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి అవసరమైన చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు చెబుతున్న మాట. ఎట్టి పరిస్థితుల్లో వాహన చోదకులకు ఇబ్బందులు కలిగించేలా రోడ్లపై మొక్కజొన్న నే కాదు మరి ఇతర పంటలను కూడా ఆరబెట్టకూడదు. ఈ విషయం ప్రతి ఒక్కరికి తె లుసు. నిబంధనలు పాటించకుండా వా హన చోదకులకు ఇబ్బందుల గురిచేస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

# అందుబాటులోకి డిజిటల్ రూపాయి యాప్

ముంబై, : భారతీయ రిజర్వ్ బ్యాంక్ ముంబైలో నిర్వహించిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2025లో ఆఫ్‌లైన్ డిజిటల్ రూపాయిని ప్రారంభించింది. ఆఫ్‌లైన్ డిజిటల్ రూపాయి ప్రత్యేకత ఏమిటంటే, మీరు ఇంటర్నెట్ లేదా మొబైల్ నెట్‌వర్క్ లేకుండా కూడా డిజిటల్ చెల్లింపులు చేయవచ్చు. మీరు దీన్ని నగదు రూపాయిల వలె ఖర్చు చేయవచ్చు. దీని కోసంమీరు ఏదైనాక్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయాలి లేదా బటన్ ప్రెస్ చేయాలి. అప్పుడు మీ చెల్లింపు విజయవంతంగా పూర్తవుతుంది. మీరుమీ డబ్బును డిజిటల్ పద్ధతిలో మీ వాలెట్‌లోఉంచుకోవచ్చు. డిజిటల్ రూపాయి లేదా భారతదేశ సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ. మీరు దీనిని భారతీయ రూపాయిడిజిటల్ అవతార్‌అని కూడా చెప్పవచ్చు. మీరు ఇంటర్నెట్ లేకుండా కూడా డిజిటల్ రూపాయిని ఉపయోగించవచ్చు. ఉదాహరణకు, ఇది మీ పర్సులో ఉంచిన నగదు లాంటిదే. తేడా ఏమిటంటే ఇది డిజిటల్ రూపంలో అందుబాటులో ఉంది. మీరు దీన్ని మీ డిజిటల్ వాలెట్‌లో ఉంచుకుని ఆఫ్‌లైన్‌లో ఉపయోగించవచ్చు. అలాగే, మీ ప్రతి లావాదేవీకి బ్యాంక్ ఖాతాకుయాక్సెస్ ఉండవలసిన అవసరం లేదు. ఈ యాప్‌ల లోమిమ్మల్ని మీరు నమోదు చేసుకున్న తర్వాత, మీరు ఏదైనా వ్యక్తి లేదా వ్యాపారానికి డబ్బు చెల్లించగలరు. ఈ ఫీచర్ గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఇక్కడ ఇంటర్నెట్, మొబైల్ నెట్‌వర్క్ సమస్యలు ఉన్నాయి. ప్రత్యేకలక్షణం ఆఫ్‌లైన్ చెల్లింపు. దీనికోసం టెలికాం కంపెనీల సహాయం, ఆధారిత చెల్లింపునకు ఉపయోగపడు తుంది. అంటే, మీరు ఆఫ్‌లైన్ చెల్లింపు చేయడానికి ఇంటర్నెట్ అవసరం లేదు. దీనివల్ల డబ్బు లావాదేవీలు సులభంగా జరుగుతాయి. డిజిటల్ రూపాయి దేశంలోని చాలా బ్యాంకుల్లో వాలెట్‌లుగా అందుబాటులో ఉంది. ఎస్బీఐ,ఐసిఐసిఐ బ్యాంక్, ఎఆఈఅఫస్ట్ బ్యాంక్, జఋా బ్యాంక్, ఊఆఈఅ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ఆఫ్ బరోడా, కోటక్ మహీంద్రా బ్యాంక్, కెనరా బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఇండస్ఇండ్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఫెడరల్ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్‌లలో ఇది ప్రారంభమవుతోంది.

# బహుళ అంతస్తుల్లో భద్రత ఏదీ..?

## హాంకాంగ్ ఘటన నుంచైనా గుణపాఠాలు నేరుస్తారా?

## ఎన్‌వోసీ ఇచ్చి చేతులు దులుపుకుంటున్న ఫైర్ విభాగం

### ప్రమాదాలు జరిగినప్పుడే హడావుడి - 18 అంతస్తులు దాటితే హ్యాండ్స్ అప్..!





హైదరాబాద్ విశ్వనగరంలా అభివృద్ధి చెందుతున్నది. నగరం నలువైపులా విస్తరిస్తున్నది. ఎటూ చూసినా బహుళ అంతస్తులే వెలుస్తున్నాయి. ఆకాశమే హద్దుగా యేడాదికి ఏడాది అంతస్తులు పెరుగుతున్నాయి. వాటి భద్రతకు భరోసా ఎక్కడుంది..? అగ్నిప్రమాదాలు సంభవిస్తే.. వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనే అగ్నిమాపక వ్యవస్థ ఉందా? అంటే లేదనే సమాధానం వస్తోంది.

అగ్నిప్రమాదాన్ని నియంత్రించే పరికరాలు అందుబాటులో ఉన్నాయా అంటే..అవేమీ లేవంటున్నారు. ఇటీవల హాంకాంగ్‌లో జరిగిన అగ్ని ప్రమాదాలు వస్తే ప్రాణాలకు భద్రత ఏదని బహుళ అంతస్తుల్లో నివసిస్తున్న ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం అనుకోకుండా వచ్చేది అలాంటి ప్రమాదాలను ఎదుర్కొవడానికి కావాల్సిన పరికాలు, యంత్రాలు ప్రభుత్వం దగ్గర సిద్ధంగా ఉండాలి.. కాని మన తెలంగాణ ప్రభుత్వం మాత్రం అలాంటి ఆలోచనే చేయడం లేదు.. హైదరాబాద్‌తోపాటు ఇతర ప్రధాన నగరాల్లో తరుచూ అగ్ని ప్రమాదాలు సంభవిస్తూ ఆస్తి నష్టంతోపాటు ప్రాణ నష్టం కూడా జరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

ఇటీవల హాంకాంగ్‌లో 30 బహుళ అంతస్తుల సముదాయంలో జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో వందల సంఖ్యలో మరణాలు చోటు చేసుకున్నాయి. అలాంటి ఘటనల నుంచి కండ్లు తెరవాల్సిన అవసరముంది. హైదరాబాద్‌లో 18 అంతస్తుల భవనాల్లో ఎక్కడైనా అగ్నిప్రమాదం జరిగిందంటే నివారించేందుకు కావాల్సిన యంత్రాలు మన అగ్నిమాపక శాఖ దగ్గర లేవు.

అంటే18 అంతస్తులపైన ప్రమాదం జరిగిందంటే ప్రభుత్వం చేతెలెత్తేసే పరిస్థితి. హైదరాబాద్ మహానగరం విశ్వనగరంలా అభివృద్ధి చెందుతూ నలువైపులా విస్తరిస్తున్నది. ఎటూ చూసినా బహుళ అంతస్తులే వెలుస్తున్నాయి. 63 అంతస్తుల వరకు అపార్ట్‌మెంట్ నిర్మాణాలకు హెచ్ఎండీఏ అనుమతులు ఇవ్వడంతో ఆకాశమే హద్దుగా యేడాదికి ఏడాది అంతస్తులు పెరుగుతున్నాయి.

ఇలా బహుళ అంతస్తుల భవనాలు పెరుగుతున్నా, వాటి భద్రతకు భరోసా ఎక్కడుంది.. ఉహించని అగ్నిప్రమాదాలు సంభవిస్తే, వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనే వ్యవస్థ అగ్నిమాపక శాఖ వద్ద ఉందా? అంటే లేదనే సమాధానం వస్తోంది.

18 అంతస్తులకుపైన ఎక్కడైనా అగ్నిప్రమాదం సంభవిస్తే అక్కడ మంటలను ఎలా అర్పేస్తారు, అక్కడ చిక్కుకున్న వారిని ఎలా రక్షిస్తారు, అగ్నిప్రమాదాన్ని నియంత్రించే పరికరాలు అందుబాటులో ఉన్నాయా? అంటే.. అవేమి లేవనే సమాధానాలు వస్తుండడంతో నగరవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం యుద్ధ ప్రతిపాదికన అగ్నిమాపక శాఖలో ప్రమాదాలను నివారించేందుకు కావాల్సిన అత్యాధునిక పరికరాలను సమకూర్చాల్సిన అవసరం ఉంది. ఇతర రాష్ట్రాలు, దేశాలు ఏ విధంగా పరికరాలను సమకూర్చుకుంటున్నాయో పరిశీలించాల్సిన అవసరం ఏర్పడింది.

మన వద్ద పరికరాలు అంతంత మాత్రమే..!: బోంటో స్కై లిఫ్టులు రెండు అగ్నిమాపక శాఖ వద్ద ఉండగా, ఇవి 54 మీటర్ల ఎత్తు వరకు (18 ఫ్లోర్ల వరకు), ఒక ఇంపోర్టెడ్ రిస్క్యూ టెండర్ , రిస్క్యూ రెండర్స్ 4, ఒక హజ్మత్ వాహనం, ఒక డీసీపీ టెండర్స్, ఒక స్నోర్కెల్, మల్టీపర్పస్ టెండర్లు 68, అడ్వాన్స్ వాటర్ టెండర్లు 9, వాటర్ కమ్ ఫోమ్ టెండర్లు 9,160 వాటర్ టెండర్లు, 18 మినీ వాటర్ టెండర్లు, 21 వాటర్ బ్రౌజర్లు, ఐదు వాటర్ లారీలు, 29 మిస్ట్ జీప్ ఇలా ప్రమాదాలను నిలువరించేందుకు ఉపయోగించే వాహనాలు అగ్నిమాపక శాఖ వద్ద 827 ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఇదిలా ఉండగా రాష్ట్ర వ్యాప్తంగా అగ్నిమాపక శాఖలో 714 ఖాళీలున్నాయి.

ఢిల్లీ, ముంబాయిలలో..: అగ్నిప్రమాదాలను నిలువరించేందుకు కావాల్సిన పరికరాలను సమకూర్చుకోవడంలో ఢిల్లీ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలు మన తెలంగాణ కంటే చాలా ముందున్నాయి. అక్కడ అగ్నిప్రమాద నిబంధనలకు సంబంధించిన చట్టాల అమలు కూడా పకడ్బందీగా అమలు చేస్తూ, ఎప్పకటిప్పుడు ప్రమాదాల నియంత్రణపై అప్రమత్తంగా ఉంటారని నిపుణులు చెబుతున్నారు. ఢిల్లీలో 110 మీటర్లపై అగ్నిప్రమాదాలను నిలువరించేందుకు కావాల్సిన స్కై లిఫ్టులు, ఫైర్ ఫైటింగ్ పరికరాలు ఉండగా, ముంబాయిలో 50 అంతస్తుల వరకు చేరుకునే ఫైర్ ఫైటింగ్ వ్యవస్థలు ఉన్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు. అదే విదేశాలలో మరింత మెరుగ్గా, అధునిక వ్యవస్థను అమలు చేస్తున్నారు.

సింగపూర్, దుబాయ్, అమెరికా, అస్ట్రేలియా, జర్మనీ, జపాన్, కెనడా, లండన్ దేశాలలో అధునాతన పరికాలు అందుబాటులో ఉన్నాయి. అక్కడ తరుచూ తనిఖీలు చేయడం, అగ్నిమాపక నియంత్రణ వ్యవస్థ ఆయా భవనాల్లో ఎలా ఉందనే విషయంలో నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, నిర్వాహకులు కూడా అప్రమత్తంగా ఉండేలా చేయడంలో అక్కడి వ్యవస్థలు పకడ్బందీగా పనిచేస్తాయి.

ఇక్కడ హడావుడే : భారీ అగ్నిప్రమాదాలు సంభవించగానే ఇక్కడ అగ్నిమాపక శాఖ హడావుడి చేస్తుంటుంది. అన్ని భవనాల్లో ప్రమాద నివారణ నిబంధనలు, పరికాలు పరిశీలిస్తామని చెబుతూ రెండు మూడు రోజులు హడావుడి చేసి, సమస్య సర్దుమణగగానే ఆ విషయాన్ని వదిలేస్తుండడం గత కొంతకాలంగా తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతోంది. గతంలో అగ్నిప్రమాదాలు ఎందుకు జరిగాయి, అవి జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మాత్రం దృష్టి పెట్టడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వం అగ్నిమాపక శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకపోవడం కూడా దీనికి కారణం. అగ్నిప్రమాదంపై ఒక్కో విభాగం ఒక్కో విశ్లేషణ ఇస్తోంది. ఎక్కువగా షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదాలు సంభవించాయంటూ ప్రమాద సమయంలో చర్చ జరిగినా చివరకు అది తమకు సంబంధం లేదంటూ ఆశాఖ చెబుతూ చివరకు ఆ ప్రమాదానికి అసలు కారణం ఎవరో తేల్చని పరిస్థితి. ఆయా విభాగాలు, పోలీసులకు వచ్చే ఫోరెన్సిక్ నివేదికలకు పొంతన ఉండడం లేదనే విమర్శలు ఉన్నాయి.

బహుళ అంతస్తుల యజమానులు ఏం చేయాలి?: భవనం భద్రత బాధ్యత నిర్మాణదారుడిపై ఎక్కువగా ఉంటుంది. బహుళ అంతస్తుల భవనాల్లో ఫైర్ అలారమ్, స్మోక్ డిటెక్టర్లు, వాటర్ స్ప్రింక్లర్లు ఏర్పాటు చేసినా అవి సరిగ్గా పనిచేస్తున్నాయా లేదా అనే విషయాలు ఎప్పకటిప్పుడు పరిశీలిస్తుండగా.. హైరెంజ్ భవనాలు నిర్మించే వారు ఆయా భవనాల నిర్మాణాలను బట్టి కనీసం నాలుగు ఫోర్లకు ఒక రెస్క్యూ ప్రాంతాన్ని ఏర్పాటు చేయాలి, ప్రత్యేకంగా ఫైర్ లిఫ్ట్ ఏర్పాటు చేయాలి. అది ప్రమాద సమయంలో ఫైర్ సిబ్బంది ఉపయోగించేలా ఏర్పాట్లు చేస్తూ,దానికి ప్రత్యేకంగా పవర్ సైప్లై ఉండేలా చూసుకోవాలి. 'అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ఎలా రిస్క్యూ చేయాలి' అనే విషయంపై నిర్మాణ సమయంలో ఖచ్చితమైన ఫ్లాన్ ఉండాలి. కార్యాలయాలు, దవాఖానాల్లో అగ్నిపమాదాల సమయంలో వెంటనే స్పందించేలా ప్రత్యేక ఫైర్ సేఫ్టీ సిబ్బందిని నియమించుకోవాలి. అగ్నిమాపక శాఖనుంచి ఫైర్ ఫైటర్లు వచ్చే వరకు ప్రాథమికంగా ఎలాంటి నష్టం జరగకుండా రిస్క్యూ చేసేందుకు ఈ సిబ్బంది ఉపయోగపడుతుంది. బహుళ అంతస్తుల్లో ఏర్పాటు చేసిన అగ్నిమాపక నియంత్రణ వ్యవస్థను ఎప్పటికప్పుడు అగ్నిమాపక శాఖ తనిఖీలు చేస్తూ ఆయా అసోసియేషన్లను అప్రమత్తంగా ఉంచాల్సిన అవసరముంటుంది.

అనుమతులివ్వడం వరకే పరిమితం..: హైదరాబాద్‌లో నివాసాలకు ఐదంతస్తులకు పైగా(జీ౦5) నిర్మించే అపార్ట్‌మెంట్లకు, వాణిజ్య భవనాలకైతే నాలుగంతస్తులకుపై (జీ౦4)లకు అగ్నిమాపక శాఖ నుంచిఅనుమతి పొందాల్సి ఉంటుంది. ఇందులో 15 మీటర్ల కంటే తక్కువ ఎత్తున్న భవనాలకు జీహెచ్ఎంసీ (హైడ్రా) నుంచి అనుమతి పొందాల్సి ఉండగా, అంతకంటే ఎత్తులో నిర్మించే భవనాలకు అగ్నిపమాక శాఖ ప్రధాన కార్యాలయం హెచ్ ఎండీఏ నుంచి అక్యూపెన్సీ సర్టిఫికెట్ తీసుకోవాల ంటే తప్పనిసరిగా అగ్నిమాపక శాఖ నుంచి ఎన్‌వోసీ కావాలి.

# ప్రభుత్వరంగ సంస్థల అమ్మకంతో దెబ్బ

### ఉపాధిరంగాలపై తీవ్ర ప్రభావం

ముంబై, : ఇప్పట్లో మన ఆర్థిక వ్యవస్థ పుంజుకునేలా కానరావడం లేదు. ప్రధానంగా నిరుద్యోగ సమస్య తీవ్రం అవుతున్నా... అందుకు తగగిన చర్యలు తీసుకోవడం లేదు. దీనికితోడు ప్రభుత్వం రంగ సంస్థలను అప్పనంగా అమ్మేయడంతో ఈ సమసయమరితం తీవ్రం కాబోతున్నదన్న భయాలు వస్తున్నాయి. అయినా మోడీ ప్రభుత్వం ఎక్కడా తగ్గడం లేదు. దీంతో కార్పోరేట్లు మరింత బలపడుతున్నారు. దేశీయంగా ఉపాధి అవకాశాలు పెంచుకుంటూ..ఉత్పత్తి రంగాలకు ఊతమిచ్చేలా సాగాల్సిన ఆలోచన చేయడం లేదు. ఇప్పటికే రెండుకోట్ల మందికి ఉపాధి గల్లంతయ్యిందన్న వార్తలు వస్తున్నా అది అంతకుమించి ఉంటుందని అంటున్నారు. కరోనాకు ముందే మన ఆర్థిక వ్యవస్థ అంతంత మాత్రంగా ఉంది. వస్తూత్పత్తి పెరిగినా.. ధరల పోటు తప్పలేదు. నిత్యావసర ధరలు విపరీతంగా పెరగడంతో జీవన శైలిపై తీవ్ర ప్రభావం చూపు తోంది. దేశంలో ఆటోమొబైల్ రంగ క్షీణత అన్నది నిరుద్యోగాన్ని పెంచే చర్యగా చూడాల్సి ఉంది. కంపెనీలు అమ్మకాలు లేకుండా మూతపడితే నష్టమని గుర్తుంచుకోవాలన్నారు. ఆర్థిక పునరుత్తేజానికి, వృద్ధిరేటును పెంచడానికి నవతరం సంస్కరణలు అవసరమని తెలిపారు. విద్యుత్తు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల రంగాల సమస్యలు సత్వరం పరిష్కరించాల్సి ఉందని, ప్రైవేటు పెట్టుబడులు పెరిగేందుకు సరికొత్త సంస్కరణలు అవసరమని తెలిపారు. ప్రైవేటురంగ విశ్లేషకుల నుంచి వృద్ధిరేటు అంచనాలు వేర్వేరుగా ఉంటున్నాయని, వీటిల్లో చాలావరకు ప్రభుత్వ అంచనాల కంటే తక్కువగా ఉంటున్నాయని అప్పట్లో పదేపదే ఆర్‌బిఐ మాజీ గవర్నర్ రఘురామరాజన్ గుర్తు చేశారు. ఆర్థిక వ్యవస్థ మందగమనం తీవ్ర ఆందోళనకరమని, పరిష్కారానికి నూతన సంస్కరణలు అవసరమని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పూర్వ గవర్నర్ రఘురామ్ రాజన్ అప్పట్లో చేసిన హెచ్చరికలు పట్టించుకోలేదు. మొత్తం మీద ఆర్థిక వ్యవస్థ మందగమనం తీవ్ర ఆందోళనకరమని అన్నారు. వివిధ రంగాలు ఇబ్బంది పడుతున్నా, వాహన రంగం మాత్రం రెండు దశాబ్దాల్లోనే ఎన్నడూ లేనంత సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సంగతి విదితమే. వాహన, అనుబంధ రంగాల్లో వేలసంఖ్యలో ఉద్యోగాలు తొలగిస్తున్నారని, స్థిరాస్తి రంగంలో అమ్ముడుకాకుండా నిర్మాణాలు భారీగా మిగిలిపోతున్నాయని, ఎఫ్ఎంసీజీ రంగంలో విక్రయాలు తగ్గుతున్నాయనే ఆందోళనలు పెరుగుతున్నాయి. ఆయా రంగాల నుంచి ఉద్దీపనల కోసం విజ్ఞప్తులు అధికమవుతున్నాయని రాజన్ గుర్తు చేశారు. ప్రస్తుతం కంటే వృద్ధిరేటును మరో 2-3 శాతం పెంచాలంటే, ఏ విధంగా దేశాన్ని ముందుకు నడిపించాలనే విషయంపై అవగాహన ఉండాలి. విద్యుత్తు, ఎన్‌బీఎఫ్‌సీ రంగాల్లో సత్వరం సమస్యలు పరిష్కరించాలి. ప్రైవేటు రంగం నుంచి పెట్టుబడులు వచ్చేలా దీర్ఘకాలిక దృక్పథం కలిగిన సంస్కరణలూ కావాలి. ప్రోత్సాహకాలు,

ఉద్దీపనలు తాత్కాలికంగా మాత్రమే ఉపకరిస్తాయి. జీడీపీని మనం ఎలా గణిస్తున్నామో, స్వతంత్ర నిపుణుల పర్యవేక్షణ ఉండాలని విశదీకరిం చారు. గత ఆర్థిక సంక్షోభంతో పోలిస్తే, ప్రస్తుతం అంతర్జాతీయంగా బ్యాంకుల స్థితి బాగానే ఉందని రాజన్ తెలిపారు. 2008లో పరపతి విధానం కీలకమైంది. ఇప్పుడు మెరుగైన విధానం కాదు, ప్రత్యేక విధానం కావాలి. మరో భారీ ఆర్థిక సంక్షోభం వస్తుందని భావించడం లేదని అయితే మన జాగ్రత్తలో మనం ఉండాల్సి ఉంది. వాటిని గమనంలోకి తీసుకుని ముందుకు సాగాల్సిన సమయమిదని ఆర్థిక వేత్తలు సూచిస్తున్నారు. ఇప్పటికే బ్యాంకుల తీరుపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉంది.

# సిటీలో మరో స్కైవాక్...



హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో పాదచారుల భద్రత, రవాణా సౌలభ్యం కోసం మరిన్ని స్కైవాక్‌లను నిర్మించడానికి హెచ్ఎండీఏ ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇప్పటికే ఉప్పల్‌లో స్కైవాక్ అందుబాటులోకి రాగా.. మెహిదీపట్నం స్కైవాక్ త్వరలోనే ప్రారంభం కానుంది. ఇదే స్ఫూర్తితో కూకట్‌పల్లి జేఎన్‌టీయూ జంక్షన్, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పరిసరాల్లోనూ కొత్త ప్రాజెక్టులకు హెచ్ఎండీఏ శ్రీకారం చుట్టబోతోంది.హైదరాబాద్ నగరంలో తొలిసారిగా ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండేఉప్పల్ రింగ్‌రోడ్ వద్ద అత్యాధునిక స్కైవాక్‌ను నిర్మించారు. 660 మీటర్ల పొడవుతో, రూ.25 కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన ఈ స్కైవాక్ పాదచారులకు రోడ్డు దాటడానికి మాత్రమే కాకుండా, సాయంత్రం వేళల్లో ప్రజల సందర్శనా కేంద్రంగా కూడా మారింది. ఉప్పల్ స్కైవాక్ సక్సెస్ కావటంతో.. హెచ్ఎండీఏ మెహిదీపట్నంలో 380 మీటర్ల పొడవైన స్కైవాక్‌ను రూ.34.86 కోట్ల వ్యయంతో నిర్మిస్తోంది. డిఫెన్స్ భూముల సమస్యల కారణంగా ఈ ప్రాజెక్ట్ కొంత ఆలస్యమైనప్పటికీ.. దాని నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చింది. మెహిదీపట్నంలో రోజూ లక్షలాది మంది ప్రయాణికులు, వాహనదారులు, పాదచారులు రద్దీగా ఉంటారు. ఈ స్కైవాక్ అందుబాటులోకి వస్తే పాదచారుల ఇబ్బందులు తొలగి, వారికి సురక్షితమైన ప్రయాణం సాధ్యమవుతుం ది.నగరంలో అత్యంత రద్దీగా ఉండే కూకట్‌పల్లి జేఎన్‌టీయూ జంక్షన్ వద్ద పాదచారుల ఇబ్బందులను గమనించిన హెచ్ఎండీఏ.. ఇక్కడ కూడా స్కైవాక్‌ను నిర్మించాలని నిర్ణయించింది. ఈ కొత్త స్కైవాక్ జేఎన్‌టీయూ మెట్రో స్టేషన్ నుంచి లులు మాల్ వరకు సుమారు 600మీటర్ల పొడవుతో నిర్మించనున్నారు. ఈప్రాజెక్ట్‌ను పీపీపీ పద్ధతిలో చేపట్టాలా లేక నేరుగా హెచ్ఎండీఏ ద్వారానే నిర్మించాలా అనే విషయాలపై అధికారులు ప్రస్తుతం అధ్యయనం చేస్తున్నారు. త్వరలోనే దీనికి సంబంధించిన డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ను సిద్ధం చేసి, నిర్మాణ పనులను ప్రారంభించనున్నారు. హైదరాబాద్‌లో ఉన్న మరో కీలకమైన రవాణా కేంద్రం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్. ఇక్కడ కూడా భారీ స్కైవాక్‌ను నిర్మించేందుకు హెచ్ఎండీఏ సన్నాహాలు చేస్తోంది. ఈ ప్రాజెక్టులు పూర్తయితే హైదరాబాద్‌లో పాదచారుల భద్రత గణనీయంగా మెరుగుపడుతుంది. ఈ స్కైవాక్‌లు కేవలం రోడ్డు దాటడానికి మాత్రమే కాకుండా, నగర జీవనంలో అంతర్భాగంగా నిలిచిపోతాయి.

# సిద్ధిపేటకు బై పాస్...




మెదక్:మెదక్ పట్టణంలో ట్రాఫిక్ సమస్యఅనేది రోజురోజుకూ పెరిగిపోతోంది. రెండు జాతీయ రహదారులు పట్టణం గుండా వెళ్తుండటం.. బైపాస్ రోడ్డు లేకపోవడంతో స్థానిక ప్రజలతో పాటు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీని కారణంగా ట్రాఫిక్ రద్దీ పెరగడమే కాకుండా.. ప్రమాదాలు కూడా ఎక్కువ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం జిల్లా వాసులకు శుభవార్త చెప్పింది. బైపాస్ రహదారి నిర్మాణం కోసం సమగ్ర నివేదిక సిద్ధం చేసేందుకు బిడ్లు ఆహ్వానించింది. దీంతో త్వరలో ఈ సమస్యకు పరిష్కారం లభించే అవకాశం ఉంది.మెదక్ పట్టణం గుండా రెండు జాతీయ రహదారులు (నేషనల్ హైవేలు) దూసుకుపోతున్నప్పటికీ.. ఇప్పటికీ బైపాస్ లేకపోవడం స్థానికులకు, వాహనదారులకు పెద్ద సవాల్‌గా మారింది. ప్రతిరోజూ వేలాది వాహనాలు ఒకే దారిని వాడుతుండటంతో ట్రాఫిక్ రద్దీ తీవ్రంగా పెరిగింది. దీనితో పాటు ప్రమాదాలు పెరిగి, ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోంది.బైపాస్ రహదారి అవసరాన్ని గుర్తించి... ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం సమగ్ర నివేదిక (డీపీఆర్) సిద్ధం చేసేందుకు బిడ్లు ఆహ్వానించింది.

ఇది అమల్లోకి వస్తే.. నగరంలో ట్రాఫిక్ ఒత్తిడి తగ్గి, వాహనదారుల ప్రయాణం సులభమ వుతుంది. మెదక్ పట్టణానికి బైపాస్ అవసరం కొత్త విషయం కాదు. 15 ఏళ్ల క్రితమే ప్రతిపాదనలు పంపినప్పటికీ.. ఇప్పటివరకు ఆచరణలోకి రాలేదు. 2014లో సర్వే చేసినా.. పనులు ముందుకు జరగలేదు.ప్రస్తుతం గండిమైసమ్మ నుంచి మెదక్ వరకు 765డి నేషనల్ హైవే పూర్తయింది. మెదక్ మీదుగా కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి వరకు పనులు జరుగుతున్నాయి. అయితే సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల శివారు నుంచి కొల్చారం వరకు అటవీప్రాంతం కారణంగా విస్తరణ ఆగిపోయింది. ఈ నేపథ్యంలోనే బైపాస్ నిర్మాణం అవసరమని కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ డీపీఆర్ ద్వారా తేల్చనుంది.

# నెగెటివ్ ఎనర్జీని వదిలించుకోవాలి!

తిరుమల, :మన శరీరంలోకి అధిక మొత్తంలో ప్రాణశక్తిని చేర్చే ఏకైక మార్గం ధ్యానం, యోగాయే... అందుకే భారతీయ ఋషులు ధ్యానం, యోగ మార్గాన్నే అనుసరించారు. రోజూ కనీసం అర గంట... ధ్యానం, యోగ చెయ్యండి... ఆరోగ్యంగా జీవించండని తెలిపారు. అలాగే నెగెటివ్ థాట్స్‌కు దూరంగా ఉండాలి. అలా ఉంటేనే మన అవయవాలు సరిగా పనిచేస్తాయి. లేకుంటా వాటిపై ప్రభావం పడి అవి పనిచేయకుండా చచ్చుపడతాయి. మన శరీరంలోకి వెళ్లిన ఆహారం 24 గంటల్లో... మలినంగా బయటికి వెళ్లిపోవాలి. లేకపోతే ఆ మలినాలు జబ్బులకు కారణం అవుతాయి. .మన శరీరం లోకి వెళ్లిన నీరు 4 గంటల్లో బయటికి వెళ్లిపోవాలి, లేకపోతే జబ్బులు తప్పవు. మన శరీరంలోకి వెళ్లిన గాలి ఒక నిముషంలోగా బయటికి వెళ్లిపోవాలి లేకపోతే మనం రోగ గ్రస్థులం అవుతాం. మరి మనలోకి చేరిన కోపం, అసూయ, ద్వేషం, మోసం... ఇలాంటివన్నీ సంవత్సరాలుగా మనలోనే ఉంటే... ఏమౌతుందో తెలుసా... మనం నిత్య రోగగ్రస్తులుగా అవుతాం.అందుకే ఋషులు అంటారు... మనం రోజూ జీవిస్తున్నాం అని అనుకుంటున్న మూర్ఖులం... నిజానికి మనం రోజూ కొద్దీ కొద్దీగా మరణిస్తున్నాం. మనకు వయసు పెరిగితే... ఆయుష్షు తగ్గినట్టా? పెరిగినట్టా?...



మనం ప్రతి రోజూ... నెగెటివ్ ఎనర్జీ లతో కొద్ది కొద్దిగా మరణిస్తున్నామన్న చేదు నిజాన్ని త్వరగా గ్రహించాలి. మనలో చేరి బయటికి వెళ్లిపోకుండా తిష్ట వేసుకొని... మన జీవితాల్ని మృతప్రాయం చేస్తున్న కోపాన్ని, ఒత్తిడిని, ద్వేషాన్ని, బద్ధకాన్ని, అనారోగ్యాన్ని ప్రతి రోజూ ధ్యానం, యోగ చెయ్యడం ద్వారా ప్రాణశక్తిని ఎక్కువగా పొంది నెగెటివ్ ఎనర్జీ దూరం చెయ్యాలి.

Printed by Published by KANDADI MAHENDER REDDY on behalf of KANDADI MAHENDER REDDY,
Printed at and Published at Flat no.101, Ushodaya Towers, IDA Jeedimetla, Quthbullapur editor KANDADI MAHENDER REDDY.